చిట్టడవుల్లా చెరువులు.. పొలాలన్నీ బీళ్లు

చెరువులో నీరుంటే... భూగర్భ జలాలు పుష్కలంగా ఉంటాయి. చుట్టు ప్రక్కల పల్లెల్లో ఏ పొలం చూసినా పచ్చ దనంతో కళకళలాడు తుంటుంది. అయితే ఇందుకు భిన్నంగా బద్వేల్ నియోజకవర్గంలోని కొన్ని చెరువులకు చుక్కనీరు చేరకపోవడంతో ఆయకట్టు పొలాలు బీడుబారాయి. వర్షం కురిసినప్పుడు నీరొచ్చే మార్గాల్లో ఆక్రమణలు పెరగడం, అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడమే ఇందుకు కారణం. ఇవన్నీ వెరసి ప్రస్తుతం చెరువులన్నీ చిట్టడవుల్లా కనిపిస్తున్నాయి.


గొడుగునూరు చెరువులో ఏపుగా పెరిగిన ముళ్ల కంపలు


కమలకూరు చెరువు దుస్థితి ఇదీ..

- ముళ్ల కంపలతో నిండిపోయిన చెరువులు
- కన్నెత్తి చూడని నీటిపారుదల శాఖ అధికారులు
- బీడు బారిన వేలాది ఎకరాల ఆయకట్టు

బద్వేలు వ్యవసాయం : నియోజకవర్గంలోని కలసపాడు, గొడుగునూరు, పుట్టాయిపల్లె చెరువులు చుక్కనీరు లేక వెలవెల బోతున్నాయి. కలసపాడు చెరువు కింద దాదాపు 500 ఎకరాల ఆయకట్టు ఉంది. ఐదేళ్లుగా నీరు చేరడం లేదు. ఈ చెరువు నీటితో కళకళలాడితే కలసపాడుతోపాటు చుట్టు పక్కల గ్రామాలైన అక్కివారిపల్లె, ముసల్‌రెడ్డిపల్లె, మహనందిపల్లె, మామిళ్లపల్లె, కర్నంవారిపల్లె, సిద్ధమూర్తిపల్లె గ్రామాల వ్యవసాయ బోరు బావుల్లో భూగర్భజలాలు పుష్కలంగా ఉంటాయి. అయితే చెరువు స్థలంలో కొందరు భూములు చదును చేసుకుని పంటలు వేసుకోవడంతో నీరు చేరే పరిస్థితి లేదు. గతంలో ఎగువ సగిలేరు ఆనకట్ట నుంచి పిటి. చానల్ ద్వారా గతంలో ఇక్కడకు నీరు చేరేది. 2008లో తెలుగుగంగ కాలువ ద్వారా నీరందించినా.. ప్రస్తుతం పి.టి.చానల్ ముసల్‌రెడ్డిపల్లె గ్రామం వద్ద తెలుగు గంగ ప్రధాన కాల్వలో కలిసిపోయింది. దీంతో కలసపాడు చెరువుకు నీరు చేరడం లేదు. ప్రస్తుతం బోరు బావులు ఎండిపోతున్నాయి.

చెరువుల దురాక్రమణ

గొడుగునూరు, పుట్టాయిపల్లె చెరువులకు మూడేళ్లుగా నీరు రావడం లేదు. చెరువులకు నీరు వచ్చే మార్గాలు మూసుకుపోయాయి. చాలాచోట్ల కాల్వలు పూడ్చి పొలాలు తయారుచేసుకున్నారు. గొడుగునూరు చెరువులో కంపచెట్లు ఏపుగా పెరిగి చెరువు ఆనవాళ్లే లేకుండా పోయాయి. ఈ చెరువుకు బద్వేల్ పెద్ద చెరువు నుంచి నీరు రావాల్సి ఉంది. ప్రస్తుతం బద్వేల్ పెద్ద చెరువులోనూ నీరు లేదు. పుట్టాయిపల్లెకు చెరువుకు నీరు వచ్చే మార్గమే కనిపించడం లేదు. కంపచెట్లు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తోంది. కమలకూరు చెరువుదీ ఇదే పరిస్థితి.

కాల్వ చెంతనే ఉన్నా.. చుక్కనీరు రాదు



తలాపునే తెలుగు గంగ కాల్వ ఉంది. చెరువులో చుక్కనీరు లేదు: ఈ చెరువుకు దాదాపు 30 అడుగుల కింద కాలువ పోతోంది. దీంతో పైకి నీరు చేరడం కష్టమవుతోంది. దాదాపు పదేళ్లుగా ఆయకట్టు పొలాలు బీడు బారాయి.

- ఎద్దుల నారాయణ, రైతు, ముసల్‌రెడ్డిపల్లె, కలసపాడు మండలం

పశువులు తాగేందుకు నీరు లేదు



మండలంలో పశువులు తాగడానికి నీరు లేదు. చెరువులో నీరుంటే రోజంతా పొలాల్లోనే ఉండేవాళ్లం. ఇప్పుడు వ్యవసాయం బరువైంది. ధరలు పెరగడంతో పెట్టుబడులు చేతికి రావడంలేదు. చెరువులో నీరు లేక వ్యవసాయం చేసే వారూ తగ్గిపోతున్నారు.

- చిన్నపురెడ్డి, రైతు, మాడపూరు, అట్లూరు మండలం

రేపు మల్లేపల్లెలో ఆధార్ శిబిరం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లె సచివాలంయలో సోమవారం ఉదయం 11గంటల ప్రత్యేక ఆధార్ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వెంగమునిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని సాంకేతిక సమస్యలతో ఆలస్యమవుతున్నా, ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.

ఆశ్రమానికి రూ.లక్ష వితరణ


సేవాశ్రమానికి లక్ష రూపాయలు అందజేస్తున్న రమణారెడ్డి

కాశినాయన : మండలంలోని ఓబుళాపురం సగిలేరు ఒడ్డున వివేకానంద సేవాశ్రమానికి గొంటువారిపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోవిళ్ల రమణారెడ్డి లక్ష రూపాయలు శనివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఆశ్రమాన్ని స్థాపించి ఎంతోమంది అనాథలకు ఆశ్రయం కల్పిస్తున్న వివేకానంద సేవాశ్రమానికి ప్రతి ఒక్కరూ తోచిన విధంగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. దాతృత్వం చాటిన రమణారెడ్డికి సంస్థ ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. కార్తికమాసం తొలి శనివారం కావడంతో స్వామికి ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిపి అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దాతలు వారికి అన్నదానం ఏర్పాటుచేశారు.

ఆస్పత్రిలో పింఛన్ల పంపిణీ


వృద్ధులకు పింఛన్ అందజేస్తున్న మహిళా పోలీస్

బ్రహ్మంగారిమఠం : ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని మల్లేపల్లె, సోమిరెడ్డిపల్లె, తోట్లపల్లె సచివాలయాల పరిధిలోని వృద్ధులకు సిబ్బంది శనివారం అక్కడే పింఛన్ సొమ్ము అందజేశారు. మల్లేపల్లె మహిళా పోలీస్, తోట్లపల్లె వెల్ఫేర్ అసిస్టెంట్లను ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంగమునిరెడ్డి అభినందించారు.

చెత్తా చెదారం తొలగింపు

ప్రొద్దుటూరు : రాజుపాళెంలోని టంగుటూరు గ్రామానికి వెళ్లే రహదారిలో పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని శనివారం రాజుపాళెం ఎస్‌ఐ కత్తి వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం జేసీబీ సాయంతో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షాకాలం కావడంతో విష పురుగులు సంచరించే అవకాశం ఉందన్నారు. దీంతో బహిరంగ ప్రదేశాల్లో చెత్తా చెదారాన్ని తొలగించే కార్యక్రమం చేపట్టామన్నారు.

డీలర్లు సరకులు అమ్ముకొంటున్నారు


డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్లు

ప్రొద్దుటూరు : పట్టణంలోని 87, 88వ రేషన్ దుకాణాల డీలర్లు కందిపప్పు లబ్ధిదారులకు ఇవ్వకుండా అమ్ముకుంటున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారుమునిరెడ్డి, ఆయిల్ మిల్‌ఖాజా తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డిని శనివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు రేషన్ దుకాణాలను పర్యవేక్షించాలని, ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించాలని కోరారు.

ఆస్పత్రికి బెడ్ వితరణ


ఆటోమేటిక్ బెడ్ అందజేస్తున్న దాత ఫారూఖ్

మైదుకూరు : మండలంలోని వనిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి హైదరాబాద్‌కు చెందిన షేక్ మహమ్మద్ ఫారూఖ్ ఆటోమేటెడ్ మెడికల్ బెడ్‌ను వితరణ చేశారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇర్షాద్, సర్పంచ్ గౌస్ లాజం, సాదిక్ అలీ, చాను సున్ని, కత్వాలు జాఫర్ హుస్సేన్, ఖాసీం పీరా, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు


పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు : స్థానిక మహమ్మదీయ కాలనీలోని 1, 2, 3 వీధులు, ఎల్‌బీసీ బ్యాక్ సైడ్ ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తడంతో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్పందించారు. మహమ్మదీయ కాలనీ–2 వీధి వద్ద ఇంటర్ కనెక్షన్ చేయు పైపులైన్ పనులను మున్సిపల్ సిబ్బందిచే చేయించారు. ప్రజలకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆయన సూచించారు.

పార్టీ నాయకుడికి పరామర్శ


రమణారెడ్డిని పరామర్శిస్తున్న గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : మండలంలోని చిన్న యరసాలకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు రమణారెడ్డి అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ ఇటీవల ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆయన ఇంటికి వెళ్లి రమణారెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు రామసుబ్బారెడ్డి, రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించలేం


మాట్లాడుతున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి

గోపవరం : మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించలేమని ఎంపీడీఓ రామనాథరెడ్డి అన్నారు. మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ ధనలక్ష్మి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గత మూడు నెలలుగా జరిగిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే ప్రణాళికతో కూడిన నివేదికను ముందే కార్యాలయంలో అందజేయాలని చెప్పినా.. ఏ శాఖ అధికారి కూడా నివేదిక ఇవ్వలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, గైర్హాజరవుతున్న అధికారులు 48 గంటలలోగా రాతపూర్వకంగా వివరణ తెలియజేయాలన్నారు. లేని పక్షంలో వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి మాట్లాడుతూ నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని, మండలంలో పది చెరువులకు ఎన్నికలు జరగాల్సి ఉందన్నారు. ఇందుకోసం ఓటరు జాబితాలను ఆయా సచివాలయాల నోటీసు బోర్డులో ఉంచడం జరిగిందని, అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎక్కువ మంది కొత్త రేషన్ కార్డులు అడుగుతున్నారని, ఇప్పటివరకు ఈ విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదని, అనుమతి వచ్చిన వెంటనే రేషన్ కార్డులో చేర్పులు, మార్పులు చేస్తామన్నారు. రెవెన్యూ పరంగా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం శాఖల వారీగా అధికారులు తమ ప్రణాళికలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు సరస్వతమ్మ, రాజేశ్వరి, రామ్మోహన్ రెడ్డి, భాగ్యమ్మ, సర్పంచులు లక్ష్మిదేవి, వైద్యాధికారి డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ చెన్నయ్య, ఏపీఓ విజయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీహరి, పశువైద్యాధికారి శిరీష, ఈఓపీఆర్‌డీ హసీన, పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డి, మోశ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పరిశుద్ధ ఆత్మల పండగ


పరిశుద్ధ ఆత్మల పండగ సందర్భంగా సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న క్రైస్తవులు

బద్వేలు అర్బన్ : స్థానిక సీఎస్‌ఐ సెయింట్ పాల్స్ టౌన్ చర్చిలో శనివారం నిర్వహించిన పరిశుద్ధ ఆత్మల పండగను (సమాధుల పండగ) క్రైస్తవులు శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చర్చి ఆవరణలోని సమాధులను సుందరంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

ఈ సందర్భంగా సీఎస్‌ఐ చర్చి గురు వర్యులు రెవ. జి.డబ్ల్యూ.స్వరాజ్ జీవన్‌బాబు మాట్లాడుతూ ఏటా నవంబర్ 2న నిర్వహించుకునే ఈ పండగలో పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థనలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం పలువురి సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ సెక్రటరీ జి.కిరణ్‌ఎడ్వర్డ్, ట్రెజరర్ ఎం.సునీల్‌కుమార్, కమిటీ సభ్యులు ఎస్.దేవానందం, జి.సునీల్‌కుమార్, ఎన్.ప్రసన్న, జ్యోతి, సుజాత, సంఘస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీనివాస నగర్‌లోని ఎస్‌పీజీ–1 క్రైస్ట్ చర్చి సమాధుల తోటలో శనివారం రాత్రి క్రైస్తవులు సమాధుల పండగ నిర్వహించారు. సమాధులను శుభ్రపరచి, పూలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించారు. తమ పూర్వీకుల ఆత్మలకు శాంతి కలగాలని కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు అబ్రహం ప్రేమ్ చంద్, రంజిత్, బెంజిమెన్, రాజు, సంఘ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పక్కాగా స్కిల్ సర్వే


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్ : పట్టణంలో చేపట్టిన స్కిల్ సర్వేను పక్కాగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభా భవనంలో వార్డు సచివాలయాల సెక్రటరిలకు మాస్టర్ ట్రైనర్లు సుబ్బరాయుడు, గౌతమ్‌రెడ్డి సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఇంటికీ వెళ్లి 15 నుండి 59 సంవత్సరాల వయస్సు గల వారిని గుర్తించి వారి నైపుణ్యాల వివరాలు సేకరించాలన్నారు. నియోజకవర్గానికి ఒక స్కిల్ హబ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ప్రజలు సర్వేకు సహకరించాలని కోరారు.

నైపుణ్య గణన

ఖాజీపేట(చాపాడు) : మండల వ్యాప్తంగా చేపట్టనున్న నైపుణ్య గణన సర్వే పక్కాగా చేపట్టాలని మండల అభివృద్ధి అధికారి దివిజా సంపతి పేర్కొన్నారు. ఖాజీపేటలో గ్రామ సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణనపై శనివారం అవగాహన కల్పించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా చదువుకున్న నిరుద్యోగులను గుర్తించాలని, వారందరికీ ప్రభుత్వం శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని తెలిపారు. సిబ్బంది చేపట్టే ఈ నైపుణ్య గణన సర్వే పక్కాగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ రమణ, ఏపీఎస్‌డీసీ స్టాఫ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి హెడ్ క్వార్టర్‌లో ఉండాలి

రాజుపాళెం : మండలంలోని వివిధ శాఖల్లో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులంతా హెడ్ క్వార్టర్లోనే నివాసం ఉండాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మారయ్య పేర్కొన్నారు. రాజుపాళెంలో విలేకరులతో శనివారం వారు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఏ ఒక్క ఉద్యోగి అక్కడ నివాసముండడం లేదని, ఇతర ప్రదేశాలలో నివాసముంటూ రోజూ డ్యూటీకి వస్తున్నారన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పోలీస్, ఆరోగ్య శాఖలో 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అనంతరం తహసీల్దారు వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు.

జిల్లా పరిషత్ పాఠశాల తనిఖీ

మైదుకూరు : పట్టణంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాలను డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి శనివారం తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు పరిశీలించారు. అపార్‌ను వెంటనే పూర్తి చేయాలని హెడ్మాస్టర్ గోశెట్టి రామమోహన్‌కు సూచించారు. పాఠశాలకు విద్యార్థులు సక్రమంగా హాజరయ్యేలా చూడాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం తిని ఏజెన్సీదారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పద్మలత, మీసాల మునయ్య, ఆవుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

గర్భ కోశ వ్యాధుల వైద్య శిబిరం

కాశినాయన : మండలంలోని అక్కంపేట గ్రామంలో పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం శనివారం నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయ సంచాలకులు డాక్టర్ కె.చంద్రశేఖర్ హాజరయ్యారు. సుమారు 39 పశువులకు గర్భకోశ చికిత్స చేసి, గొర్రెలకు నట్టల నివారణ మందు తాగించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు డాక్టర్ శివ శ్రీనివాసులరెడ్డి, నిరోష, సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

పోరుమామిళ్ల : మద్యం తాగి వాహనం నడిపి పోరుమామిళ్ల కోటవీధికి చెందిన అన్నం సయ్యద్ బాబుకు బద్వేలు కోర్టు ఏడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. అక్టోబర్ 28న మద్యం తాగి ఆటో నడుపుతుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

పాఠశాల, దేవాలయాల వద్దే మద్యం దుకాణాలు


డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : నిబంధనలను పాటించకుండా ఏర్పాటుచేసిన మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల నాయకులు కత్తి ఓబులేసు, గడ్డం నరసింహులు మాదిగ డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దారు సాయినాథ్‌రెడ్డిని శనివారం కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని కళాశాల, పాఠశాల, దేవాలయాలకు వంద మీటర్ల లోపు మద్యం దుకాణాలు ఏర్పాటుచేసినా.. చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. మైదుకూరు రోడ్డులో రాణి తిరుమలదేవీ డిగ్రీ కాలేజీ సమీపంలో సింధూరి వైన్స్, కొర్రపాడు రోడ్డులో వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద నిబంధనలను పాటించకుండా మద్యం దుకాణం ఏర్పాటుచేశారన్నారు. పాత బస్టాండు ప్రాంతంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం సమీపంలోని మసీదు వద్ద భారత్ వైన్స్, బొల్లవరంలో ఆదిత్య పాఠశాల, సరస్వతీ విద్యా మందిరం పాఠశాల వద్ద జాను మద్యం దుకాణం, భగత్ సింగ్ కాలనీలో టీవీ ఆర్ స్కూల్, పెద్దమ్మగుడి వద్ద ప్రొద్దుటూరు వైన్స్ మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు. కొవ్వూరు గ్రాండ్ అనే హోటల్‌లో బార్ పర్మిషన్ ఇవ్వడం చాలా దారుణమన్నారు. విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో ఉన్న ప్రాంతాల్లో నిబంధనలను పాటించకుండా మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న దుకాణాలను వెంటనే ఎక్సైజ్ శాఖ అధికారులు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, బెనర్జీ, చెన్నమ్మ, ఆనంద్, బాలబయన్న తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలి


కొండయ్య విగ్రహం వద్ద కుటుంబీకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరచుకోవాలని సీతారామపురం కాశినాయన ఆశ్రమానికి చెందిన గణపతిస్వామి అన్నారు. స్థానిక మడూరు రోడ్డులోని శ్రీసౌభాగ్య కుంకుమ ఇండస్ట్రీలో వ్యవస్థాపకుడు అల్లుట్ల కొండయ్య పంచమ వర్ధంతి సందర్భంగా కొండయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లుట్ల కొండయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తమకు వచ్చిన ఆదాయంలో 10 శాతం సేవా కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమన్నారు. అనంతరం ట్రస్ట్ లోగోను ఆవిష్కరించారు. కుమారులు అల్లుట్ల మల్లికార్జున, శంకరయ్య, కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశాలు నిర్వహించాలి


మాట్లాడుతున్న నాబార్డ్ డీడీఎం విజయ విహారి

మైదుకూరు : రైతు ఉత్పత్తుల సహాయ సహకార సంఘాల (ఎఫ్‌పీఓ) సర్వసభ్య సమావేశాలను ప్రతి ఏటా తప్పక నిర్వహించాలని నాబార్డు డీడీఎం విజయవిహారి అన్నారు. మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో దువ్వూరు, పోరుమామిళ్ల, కాశినాయన, బి.కోడూరు, కలసపాడు ఎఫ్‌పీఓల కార్యకలాపాలపై శనివారం డీడీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా విజయవిహారి మాట్లాడుతూ నాబార్డు నుంచి అందే సహాయ సహకారాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్త బాలకృష్ణ, శాస్త్రవేత్త శ్రీవిద్యారాణి, రైతులు పాల్గొన్నారు.

శనగ సాగు ముమ్మరం

రాజుపాళెం : రబీ సీజన్ ఆరంభమవడంతో రైతులు శనగ సాగు ముమ్మరం చేశారు. విత్తన శుద్ధి చేయడం, ట్రాక్టర్లతో విత్తనం వేయడం వంటి పనులతో పొలాల్లో బిజీ బిజీగా కనిపించారు. ఈ ఏడాది దాదాపు 23 వేల ఎకరాల్లో శనగ సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఎకరా పొలంలో ఎర్ర శనగలు 40 నుంచి 60 కిలోలు, తెల్ల శనగలు 55 నుంచి 70 కిలోలు విత్తాల్సి ఉంటుందని, సకాలంలో వర్షం పడడంతో శనగ మొలక శాతం బాగా వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.


తెల్ల శనగకు విత్తనశుద్ధి చేస్తున్న రైతులు


ట్రాక్టరుతో విత్తనం వేస్తున్న రైతు

కార్తిక పూజలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో వీరభద్ర స్వామి

మైదుకూరు : మైదుకూరు పార్వతీ సమేత భీమేశ్వరాలయంలో శనివారం నుంచి కార్తిక మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం పది గంటలకు ఆలయ అర్చకులు మాధవాచార్యులు, లోకేశ్వరాచారి గణపతి హోమాన్ని నిర్వహించారు. సాయంత్రం భక్తులు ఆకాశ దీపానికి పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

వీరభద్రుడి సన్నిధిలో..

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి సన్నిధిలో శనివారం కార్తిక మాస పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచి వీరభద్రస్వామి, భద్రకాళీమాత, కేదారీశ్వరులకు అభిషేకం జరిపి అలంకరించారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకుని, ఆలయం ఆవరణలో దీపాలు వెలిగించారు. ఇదే క్రమంలో ఆలయ ప్రధాన ధ్వజ స్తంభం వద్ద పూజలు నిర్వహించి కార్తీక దీపం ఏర్పాటుచేశారు. ఈ కార్తీక మాసం పూర్తయ్యే వరకూ దీపం వెలుగుతుందని పండితులు తెలిపారు. అనంతరం భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

శివాలయంలో ఆకాశ దీపం..

రాజుపాళెం: కార్తిక మాసం సందర్భంగా మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెల్లాల భీమలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం అర్చకులు వెంకటాచలపతి ఆకాశ దీపాన్ని వెలిగించారు. ముందుగా భీమలింగేశ్వర స్వామి, పార్వతీదేవి, వీరభద్ర, వినాయకుడు, నరసింహ స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆకాశ దీపం వెలిగించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి సన్నిధిలో దీపాలు వెలిగించారు.


ధ్వజ స్తంభం వద్ద దీపం వెలిగిస్తున్న అర్చకులు


ఆకాశ దీపం వెలిగిస్తున్న అర్చకులు వెంకటాచలపతి